# Andhra Jyothi

## ఏఈల భర్తీకి ఆర్థిక శాఖ కొర్రీ!

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కోలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీరు (ఏఈ) పోస్టులను భర్తీ చేయడంపై ఆర్థిక శాఖ కొర్రీ వేసింది. ఏపీజెన్‌కోలో ఖాళీగా ఉన్న 219, ఏపీ ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న 250 అసిస్టెంట్ ఇంజనీర్ల నియామకాలను చేపట్టేందుకు ఇంధన శాఖ ప్రభుత్వ అనుమతిని కోరింది. ముఖ్యమంత్రి సమ్మతి లభించిన తరువాత, ఇంధన శాఖ ద్వారా ప్రభుత్వ ఆమోదం కోసం ఫైలును పంపారు. ఈ ఫైలు ఆర్థిక శాఖకు చేరింది. రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్తు వ్యవస్థను గాడిలో పెట్టడంతోపాటు .. గృహావసరాలు, పారిశ్రామిక సంస్థలకు నిరంతర విద్యుత్తు ఇవ్వడం ప్రభుత్వ ప్రాధాన్యంగా మారింది. దీంతో, కొత్తగా సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం , నిరంతర పర్యవేక్షణ చేయడం అధికమైంది. ఇప్పటికే, సహాయ ఇంజనీర్లపై పనిభారం రెండింతలు పెరిగింది. ఈ నేపథ్యంలో ఏఈ ఖాళీలను భర్తీ చేయాల్సిందేనని ఇంధన శాఖ భావిస్తోంది. ఇందుకు పాలనా ఆమోదమూ ఉందని చెబుతుంది. అయితే ఆర్థికశాఖ మాత్రం, ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు గల నిబంధనలను వివరించాలని కోరింది.